మణి

శ్రీమతి పెద్దిశెట్టి రామంగారు

(అనుబంధకథ)

[మాధవరావు చెన్నపట్నములో వరశుల్కవిరోధోపన్యాసముల నుత్సాహావశమున నిచ్చి, యింటికివచ్చి మణియను పేదపిల్లను వివాహమాడెదనని మాటయిచ్చి ముద్దు పెట్టుకొని, బీచికివెళ్లి సబ్ జడ్జీప్రసాదరావుగారికూతురు, విద్యావతియగు లీలనుచూచి ప్రేమించి మణినిమఱచి, తనకిష్టములేకున్నను తండ్రికట్నమునకాసించి పెండ్లాడవలెనని ఆజ్ఞాపించిన వసుంధరయను వకీలుపుత్రికను పెండ్లియాడెను. మణిని ఆపె మేనమామ కమలాకరునకిచ్చి ఆమెతలిదండ్రులు పెండ్లిచేసిరి కాని, ఆపెకు అతనిపై మోహము లేదు. పెండ్లిఅయిన యిరువదిదినములలో అతను మరణించెను. ఆపెఅన్న కేశవరావు ఆమెకు మెప్పేవరకుచదువుచెప్పి యల్.యం.పి చదివించుచుండెను.ఆపె కమలాకరుని భర్తగ తలంచలేదు. మాధవరావుపై మోహమును వీడలేదు. వసుంధరపై మాధవ రావునకు మోహములేదు. ఆమెకదే దుఃఖము. అయినను వారికి కాపురముసాగి ఒక కూతురు ఒకకొడుకుపుట్టి పాపమాపె మరణించును. మాధవరావుతండ్రి వసుంధర తండ్రికూడ మరణించిరి.]

వసుంధర చనిపోవుటచే ఆపెతల్లి రుక్మిణమ్మ విచారము మరియు వృద్ధిపొందినది గాని పాపమా ఇల్లాలు ధైర్యము తెచ్చుకొని రెండవ కుమార్తెయగు శ్రీలతను చూచుకుంటూ పొరుగపిల్లలకు చదువు చెప్పించుచు కాలక్షేపము చేయుచున్నది. మాధవరావు తల్లి సుందరమ్మ ఒకదినమున 'నాయనా! నీ యిష్టము వచ్చిన పిల్లను ఎవరినైనా చేసుకొనుము. నీదుఃదృష్ట మునకు చింతిస్తూకూర్చున్న దెట్లు? ఎవరిగీతఎట్లున్నదో ఎవరుచెప్పగలరు నాయనా' అని సుందరమ్మ అనుటయే తడవుగా 'అమ్మా! సబ్ జడ్జీవారికుమార్తె లీలను పెండ్లి చేసుకొందునా?' అని అడిగినాడు మాధవుడు. 'వద్దు నాయనా, ఆపిల్లవద్దు; అదేమిటి భోగంబానివలె మున్నది.

అమ్మా చదువుకున్నవాళ్లు మరి ఫ్యాషన్‌గా వుందరాఅమ్మా

ఏమిటినాయనా? చదువుకున్నయెడల నవనాగరికతగా యుండవలెనా? చదువుకున్న అంత అనాగరికతగాకుండా విశేష వేషడాంబికములకు లోను గాకుండా యుండవలెను. చదువుకున్నవారు మంచి బుద్ధి సంపాదించుకొని నవనాగరికతయను పిశాచము నకు వశంగాకుండా యుండవలెను. అంతేగాని చదువు కున్నాంఅని ద్రవ్యమును వేషడాంబికములకు వెచ్చించుట పాడియా నాయనా! నా మాటవిను నాయనా అని దీనవదనయై పలికినది.

అమ్మా! ఇన్ని ఏలని? నేను సంసారసౌఖ్యమును అనుభవించవలెననియున్న ఈవివాహమునకు అంగీకరింపుము. లేనియెడల ఇట్లనే నేను వుండిపోయెదను అన్నాడు.

తల్లి మారుమాట వచింపలేక సరే నీ యానందమే నాయానందమని పూరుకొన్నది.

ఆదినము సాయంత్రమే మాధవుడు ప్రసాద్ రావు గారి ఇంటికిజని ఆయననుకలుసుకొని ఆమాటయీమాట ఆడినతరువాత లీలను నేను పెండ్లిచేసుకొనుటకు ఏమైనా అభ్యంతర ముండునా అని అడిగినాడు. ఆయన అభ్యంతరమేమియున్నది. నాకుసమ్మతమే. నీవుచేసుకొనుట. లీలను తప్పకుండా ఇచ్చెదనని చెప్పినాడు. మాధవుడు అధిక సంతోషముతో లీలను సమీపించి లీలా నీకొరకు వచ్చితిని. నిన్ను నాహృదయపూర్వకముగా ప్రేమించి యుంటిని. నిన్ను ప్రేమబిక్ష వేడుకొనుచున్నాను. నన్ను పెండ్లిచేసుకొనుటకు అంగీకరించమని అడిగినాడు. లీల అట్లనే లెండి, అయితే ఎప్పుడు పెండ్లిఅని నవ్వుతూ పల్కినది. లీల సమ్మతించినందుకు ఆనందముతో ఉప్పొంగిపోయినాడు మాధవుడు. లీలా, ఇంకా 17 దినములున్నవి. అని చెప్పినాడు.

ఆవెంటనే ఇంటికివచ్చి తల్లిని అడిగి 4 వేలు తీసుకొనివెళ్లి రెండు వేలకు నెక్ లేసు తీసినాడు. ఒక వెయ్యిరూపాయలకు మంచిచీరలు లీలకు తీసినాడు. 300 వందలకు రవ్వల లవ్ లక్కులు కొన్నాడు. కొంత సొమ్ము పెట్టి తను మంచిసూట్లు కుట్టించుకొన్నాడు. ఆ వున్నసొమ్ముతో కూతురగు మనోరమానికి బట్టలు కొడుకుజనార్ధనరావుకుబట్టలు కుట్టించినాడు. కట్నం లేకుండానే పెండ్లి అవుచున్నదికదాయని కుమార్తెకు మహావైభవముతో పెండ్లిచేసినాడు ప్రసాద్ రావు.

ఇంక మాధవుని ఆనందమునకు అంతులేదు. లీల భార్యయగుట తన పూర్వజన్మ సుకృతమని భావిస్తూ యున్నాడు. లీలదినచర్య ప్రొద్దునఏడుగంటలకు లేచుట; మొంహాము కడుగుకొనుట; వంటమనిషి, సిద్ధము చేసిన కాఫీ ఫలహార మారగించుట; అక్కడనుండి శృంగారించుకొనటకు మొదలుపెట్టుట; అముస్తాబు అయినతరువాత రీడింగ్ రూమ్ కు వెళ్లుట; తిరిగి 9½ గం సమీపములో ఇంటికివచ్చుట; యీజీచైరులో కొంత వరకు అనగా 11 గంటలవరకు కాలముగడుపుట; చదువుకుంటూ, వంటవాని పిలుపు అందుకొని భోజనమునకువెళ్లుట; భోజనము చేసినతరువాత కిల్లీనములు కుంటూ ఏదైనా నావల్ చదువుకొనుట; పడుకొనుట; పడుకొని 3 గంటలకు లేచుట ముస్తాబు అయేసరికి కాపీఫలహారము సిద్ధముచేసి వుంచినది ఆరగించుట; టెన్నిస్ కోర్టుకు ఏదో ముంచుకుపోవుచున్నట్లు మురళీధరుడను స్నేహితునితో కలసి వెళ్లుట; తిరిగి ఆరుగంటలకు ఇంటికి మొంహాంపట్టుట; భోజనంచేసి సినీమాగాని నాటకంగాని ఏదైనా ప్రదర్శనము చూచుటకు వెళ్లుట; రాత్రి 9 గంటలకువచ్చి పవ్వళించుట; ఆమె ప్రతి దినము చేసెడిపని. వసుంధర పిల్లలను కన్నెత్తి చూడదు. పాప మాపిల్లలు వాళ్ల నాయనమ్మదగ్గరనే యుండెదరు. మాధవుడు, 'మాధవరావుగారి భార్య మాబాగా టెన్నిస్ ఆడుతుందిరా' అని ఒకళ్లు అనుకొనుట విన్నాడు. శరీరం బూరెవలె పొంగిపోయినది. లీలను గులాబిపుష్పము చూచినట్లు చూస్తాడు. ఒక కారుకొన్నాడు లీల షికారువెళ్లుటకు. లీలలేనప్పుడు నెలకి 200రూప్యములు అవుచుండే ఖర్చు ఇప్పుడు 450 రుపాయి లగుచున్నది. ఎక్కడచూచినా పనివాళ్లే. ఆమెబట్టలు అందించుటకు విప్పినవి మడతలు పెట్టుటకు ఒకమనిషి; ఆమె తలదువ్వుకొనుసరికి దువ్వెనా అద్దము సెంటుబాటిల్ తెచ్చుటకు ఒక మనిషి; ఆమె జోడు మేజోడు అందించుటకు, విప్పిన తరువాత తుడిచి జాగ్రత్తచేయుటకు, మరల ప్రక్క ఎత్తిజేయుటకు ఒకమనిషి; ఇట్లు ఇంటినిండా పని మనుష్యులే.

మాధవుడు ఒకదినమున 'లీలా! లీలా! యీ దినము మణిదేవి అంట L. M. P. చదువుచున్నదంట ఆమెయు; శ్రీలతయనుఆమెఅంట స్కూల్ మాస్టర్ ఇద్దరు వరకుల్కము పై ఉపన్యాస మిచ్చెదరట వచ్చెదవా?' యని అడిగినాడు. 'అలాగునే వచ్చెదను ఆజోడు ఇలాగున తెచ్చిపెట్టుడు' అని అనుటతోనే

తెచ్చియిచ్చినాడు. ఇద్దరు రతీమన్మథులవలె తయారు అయి కారుపై వెళ్లిరి. మణిదేవి ముందుగా సీత నలంకరించినది. మణిని చూచగానే ఇన్నిదినములు మణిని మరిచిపోయినవానికి గబుక్కున మణి జ్ఞాపకము వచ్చినది. ఆదినము తాను మద్రాసునుండి వచ్చిన దినమున మణి తన తల్లిదండ్రుల కుటుంబముయొక్క కష్టసుఖము లన్నింటిని తెలియజేసినది. 'ఆహా! నే నెంతటి విశ్వాసఘాతకుడను. అయ్యో! మణిని పెండ్లి చేసుకుందునని చెప్పితినే. ఆమెను ఆశపెట్టి వేరొక ఆమెను చేసుకొంటినే! అయ్యో! నాయంత పాపి యీ ప్రపంచకముపై వుండబోడు. ఈ మణిదేవిని చూడగానే నామణి ముద్దులమణి జ్ఞాపకము వచ్చిన'దని విచారిస్తూయున్నాడు. ఇంకనూ విచారించుచున్న, లీల చూచిన కారణ మడుగును. అప్పుడు తడబడవలెను. అని శ్రద్ధగా వినుటకు కూర్చున్నాడు. మణిదేవి రెండవదేవివలె ఉపన్యాసము ఇచ్చినది.

పూజ్యులారా! సోదరీసోదరులారా! యీ సభకు నన్ను ఉపన్యాసమిచ్చుటకు నియమించినందుకు యీసభ నేర్పాటుచేసిన మిత్రబృందమునకు నేను వందనము లర్పింపజాలకున్నాను. ఎందుచేతనన ఏపదవికిని ఎంతమాత్రం తగని నన్నా యీపదవికి యింత గొప్పసభకు ఉపన్యాసమిచ్చుటకు నియమించుట! చాలపొరబాటు. జ్ఞానముగాని ధనసంపత్తిగాని విద్యాకుసుమంబుగానిలేని నాబోటి యయోగ్యురాలు యీసభయం దగ్రపీఠము నలంకరించుటా? ఎంతమందియో విద్యాకుసుమంబులతో ఆంధ్రమాతను భక్తిపై పూజించెడి కవయిత్రులుండగా, సంఘదౌర్జన్యము సరకుచేయక అనేకమైన సంస్కరణకార్యములు నెరపిన, నెరపుచున్న యువతీమణు లుండగా నేనా యీపీఠ మలంకరించుట? గొప్పవింత! అర్హులెల్లరు తామనర్హులమని చెప్పుకొనుట పరిపాటి అయినందున నా యీరోదన మరణ్యరోదనమే యగును కావున నాయనర్హతనుగూర్చి యేకరవుపెట్టుట మాని పెద్దలయొక్కయు మిత్రులయొక్కయు ఆజ్ఞ శిరసావహించి యీశ్వరుడగు ఆపరమాత్మకు వందనమొనర్చి యీ పీఠమును స్వీకరించుచున్నాను.

సోదరులారా, మీయొక్క యున్నతవిద్యలను నేమూలపెట్టి మీరు వరశుల్కమును స్వీకరించుచున్నారుగా? అయ్యో! ఎంతటి వింత. ఎంతటి ఘోరము. ఎంతటి తెలివితక్కువతనము. సోదరులారా! వరశుల్కమను పేర మనుష్యులను పీల్చి పిప్పిచేయుచున్న యీ వరశుల్కమును స్వీకరించకుండా ప్రయత్నించవలెను. ఎందరో తమతమ ముద్దుబిడ్డలను బి.ఏ. కు ఇవ్వవలెనని ఆశయము లున్న రెండువేల రూప్యములు పోయుచున్నారు. ఆఖరకు వారు తినుటకు తిండిలేక కట్టుటకు బట్టలేక నానా ఇబ్బందులపాలగుచున్నారు. మనసోదరులు ఇట్టిదశనొందుటకు యీ కట్నములే హేతువు. స్కూల్ ఫైనల్ అయిన 5 వందలు, యఫ్.ఏ. అయిన వెయ్యి, బి. ఏ. కు రెండువేలు యల్ టికి 3 వేలు యీలాగున చదువు ఎక్కువ అయినకొలది కట్నం వేలకువేలు పెరుగుచున్నవి. ఆ కట్నమును గ్రహించు మహానుభావులు మంచివిద్యను గ్రహించువారే! పోనీ కుంతలనుకుంటే కారే! మంచి విద్యను అభ్యసించినవారే! మళ్లీ వరశుల్కముపేర యుపన్యాసము లిచ్చినవారే! తామే ఆసమయము వచ్చిన చేయిచాపుదురు కట్నంకొరకు. సోదరసోదరీ మణులారా మీకు చెప్పున దేమన, మీమీబిడ్డలకు కట్నము లెంతమాత్రం ఇవ్వవలదు. సహోదరులారా మీరు కట్నములు స్వీకరించవలదు. వలదు. ఆసర్వేశుడు మన ఆంధ్రులకు బుద్ధిని ప్రసాదించుగాక యని ప్రార్థించుచు యీ యుపన్యాసమును ముగించుచున్నాను.

మణి

శ్రీమతి పెద్దిసెట్టి రామంగారు

[మాధవరావు వరశుల్క-విరోధవాది. పేదపిల్లయగు మణిని ప్రేమించి ముద్దాడెను. సముద్రపుటొడ్డున షికారుచేయుచున్న లీలావతియను విద్యావతినిచూచి మోహించెను. ఇంటికివచ్చి తండ్రికెదురాడలేక వసుంధరయను వకీలుపుత్రికను కట్నమునకై పెండ్లియాడెను. వసుంధర ఇద్దరు బిడ్డలనుకని, పతియొక్క యప్రేమ భరించలేక చనిపోవును. మాధవరావు తండ్రియు మరణించును. మాధవరావు స్వతంత్రుడై తానుమోహించిన లీలను సబుజడ్జీగారికూతురును పెండ్లియాడెను. మణిని మేనమామకిచ్చి పెండ్లిచేసిరి. అతని నామె ప్రేమించలేదు. పెండ్లియైన యిరువదిదినములలో అతడు మరణించెను. ఆపె యన్న కేశవరావు ఆపెను యఫ్. యె. పరీక్షను వైద్యపరీక్షను ప్యాసుచేయించెను. ఆమె మంచివక్త. వరశుల్కమునకు విరోధముగ ఒకసారి ఆపె యుపన్యసించుచుండగా లీలా మాధవులు సభకు వెళ్లుదురు.]

ఆయుపన్యాసధోరణి వినిన ప్రతి యువతీయువకుడును 'ఆహా! యేమి యీయుపన్యాసము! ఎంతో చక్కగా ఇచ్చినది. చాల బాగున్నదంటే బాగున్న' దనిరి. ఆమెచెల్లెలు స్కూలుమిస్ట్రెసు శ్రీలతాదేవి కూడ బహు చాకచక్యముగా అందరికి బోధపడునట్లుగా యుపన్యాసమిచ్చి పీఠము దిగినది. మాధవునికి మణిని చూచినతోడనే అదొకవిధముగా అయిపోయినది మనస్సు. పాపం 4 సంవత్సరములక్రిందటి తన మణి జ్ఞాపకము వచ్చుచున్నది ఆ మందభాగ్యునికి. శ్రీలతను చూచుటతోడనే తనభార్యయగు వసుంధర చిహ్నములు కాన్పించినవి. కొంతసేపు వసుంధరను తలంచుకున్నాడు. అక్కడనుండి లీలయు, తాను ఇంటికి వచ్చివేసిరి. 'లీలా! లీలా! సినిమాకు వెళ్తామా' అని అడిగినాడు. 'పోనిద్దురూ! ఇప్పుడేమిటి' అన్నది. ఇంతలో ఎవరో తలుపుకొట్టినశబ్దం అయినందున తలుపుతీసినది లీల. తనస్నేహితుడగు మురళీధరుడు వచ్చినాడు.

'ఓహో! వచ్చినా రండి' అని అధికానందముతో కూర్చొనుటకు సోఫా చూపినది. దానిపై ఆయన కూర్చొన్నాడు మురళి. బి. యె. ప్యాసు అయినాడు. మంచిపోకిల్లా! ఇంటియజమానియగు మాధవుడు అక్కడనే కూర్చున్నాడు. ఆయనతో పలకరించకుండా లీలతో ఇష్టావిలాసముగా మాట్లాడుచున్నాడు. మాధవునికి చాలకోపము వచ్చినదిగాని యూరుకొన్నాడు. 'లీలా! సినిమాకు వెళ్దామా' అని అడిగినాడు మురళీధరుడు. 'వెళ్దాము' అని ఒక్కగంతువేసి గదిలోనికివెళ్ళి రెండవషారిసి లేడీవలె తయారుఅయి వచ్చినది. మాధవుని 'తలుపువేసుకోండి' అని చెప్పినది. మాధవుడు లీలా! లీలా! అని పిలిచిన పిలుపు వినిపించుకోనకుండా వెడలినది మురళితో. మాధవుడికి చాల కోపమువచ్చినది. 'అయ్యో! సుగుణరాసియగు మణిని పోగొట్టుకొంటిని. సద్గుణఖనియగు వసుంధరను వసుంధరపాలు చేస్తిని. అయ్యో! వసుంధరా! నీవేలోకములో నుంటివోగాని నన్ను

క్షమింపుము. అనేకవిధముల నిన్ను దుఃఖపెట్టితిని. లీలా ప్రేమోన్మత్తుడనై నా వసుంధరను దుఃఖపెట్టితిని' అని కన్నీరుకార్చుచు ఏడ్చుచున్నాడు. కొంతసేపు మణిని తలంచుకొనియు, కొంతసేపు వసుంధరను తలంచుకొనియు అనేకవిధముల విచారించెను. "ఆహా! లీలా నీకొరకు ఎన్నికష్టములను అనుభవించితిని. ఎంతటిఅవస్థలకు లోనైతిని అఖరుకు లీల నాయెడ ఎంతకపటముగా ప్రవర్తించుచున్నది. నేను సినిమాకు రమ్మనిన 'పోనిద్దురూ ఇప్పుడేమిటి' అన్నది ఆమురళీధరునితో ఎట్లువెళ్లినది. నాకు వారిద్దరిచర్య అనుమానముగాయున్నది. ప్రతిదినము టెన్నిస్‌కోర్టుకువెళ్లి తిరిగి 8 గంటలకువచ్చెదరు. టెన్నిస్‌కోర్టు 6½, 7 గంటలకే ముగియును. వీరిద్దరిచర్య చాలఅనుమానాస్పదముగాయున్నది." అని పరిపరివిధముల తలంచుకొనుచు నిద్రాదేవికి వశ్యుడైనాడు.

మరునాడు సాయంకాలము టెన్నిస్‌కు వెళ్లుటకు తయారుఅగుచున్నది. ఇంతలో మాధవుడు "లీలా! యీదినము టెన్నిసుకు వెళ్లకుము. మనోమోహినికి చాల జ్వరముగాయున్నది."

"ఏమి! నీ కూతురుకు జ్వరమువచ్చిన నేనెందులకు? నేను యీదినము టెన్నిస్‌కు వెళ్లకతీరదు. మురళీధరరావుగారు మరి మరి రమ్మని చెప్పియుండిరి. వెళ్లక తీరదు."

"ఏమి లీలా! నామాటకన్నా వానిమాట ఎక్కువగాయున్నదా? అదికాక, నీవు,నీవు, అని సంబోధించుచున్నావు. మర్యాద అక్కర్లేదా? ఏమి"

"నీవు అనక పోతే మరేమిటి, నీ గొప్పఏమిటి"

అని గిర్కునమరలి టెన్నిసుకు వెళ్ళిపోయినది మురళీధరునితో. తిరిగి ఏడుగంటలకు ఇంటికివచ్చినది. భోజనంచేసినది. గాని మాధవునితో మాట్లాడుటలేదు.

అంతయు మాటుమణిగియున్నది. చీకటులు నలుగడలు వ్యాపించియున్నది. సరిగా 12 గంటలైనది. అట్టినిశీధమున లీల లేచి తలుపుతీసినది. మురళీ బండి తీసుకొనివచ్చినాడు. లీల గదిలోనికివెళ్లి శబ్దము చేయకుండా రెండుట్రంకులు తీసుకొనివచ్చినది. మురళి పెట్టెలు అందుకొని బండిలో పెట్టినాడు. లీలను చేయూతనొసంగి బండి ఎక్కించినాడు. బండి తిన్నగా స్టేషనువైపు వెళ్లిపోయినది.

ఉదయం ఆరుగంటలైనది. మాధవుడులేచి లీలా! లీలా! అని పిలిచినాడు. పలకలేదు. అంతయు వెదకినాడు. కాన్పించలేదు. మొదలునరికిన చెట్టువలె గుభీమని కూలినాడు. పూరుఅంతయు ఎక్కడచూచినా యీమాటలే, లీల మురళీధరునితో లేచిపోయినదని. పాపం యీసంగతి ప్రసాదరావుగారికి తెలిసినది. "అయ్యో! నాకు ఎంతటి అప్రతిష్ఠ తెచ్చినది. భలానా సబుజడ్జీగారికూతురు ఇటువంటిపని చేసినదంటే ఎంత చిన్నతనము." అని ఆయన దుఃఖముతో కుమిలి 'ఇంక జానిని నాకుమ్మం ఎక్కనివ్వకూడదు అది చచ్చినదని ఊరటిల్లదా' నని లేని ధైర్యముతెచ్చుకొని పూరుకున్నాడు. మాధవుడు వీధిలోనికివచ్చుట మానివేసినాడు; పిచ్చివానిచందముగా అయిపోయినాడు. తల్లి వచ్చి "నాయనా విచారించకు. ఎవరిజీవితంలో ఎట్లు వ్రాసియున్నదో అట్లుజరుగక వేరుజరుగునా? విద్యావంతుడవునీవు. అజ్ఞానముగా విచారించడం ఎందులకు? పూరకొనుము" అని కుమారునికిఅనేకవిధముల ధైర్యము చెప్పినది. యీలాగున అప్రదిష్ట వచ్చినదని బెంగపెట్టుకొని తిండి సరిగా తినుటమాని కృశించి పోయినాడు.

ఉన్నటులవుండి ఆయనకు జ్వరంవచ్చుట మొదలుపెట్టినది. ఆవూరిలోనికి బాగా పేరుతెచ్చుకొన్న మణి ఆప్తుడగు కేశవునికి కబురుపంపినది మాధవునితల్లి.

కేశవరావు మణిని వెంటబెట్టుకొని వచ్చినాడు. కేశవరావు ఏకేసుఅయినా మణికి చూపుచుండుట అలవాటు. అందుచే మణిని తీసుకువచ్చినాడు. మాధవుడు వారిద్దరిని చూచినాడు. మణిని సభలో చూచియుండినందున 'వోహో! మణిదేవిగారా?' అని కేశవునికిని మణికిని రెండుకుర్చీలు వేయింపించినాడు. వారు కూర్చున్నతరువాత కేశవుడు అతనినిపరీక్షించి ఇది మనోరోగం అని మనశ్శాంతి అనుకొని మందు ఇస్తానని పైకిఉచ్చరించి మణితో ఇంటికి వెళ్లి పోయినాడు.

సశేషము.